## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో పందిరిరాట



శివ కామేశ్వరస్వామి ఆలయం వద్ద పందిరిరాట ఉత్సవం

**శ్రీకాకుళం కల్చరల్ :** నగరంలోని మొండేటివీధిలో లలితా దేవి సహిత శివకామేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా గురువారం ఉదయం పందిరిరాట కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించి పూజలు చేశారు. కార్యక్రమంలో షిర్డీసాయి సేవా సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### నాణ్యమైన విత్తనాలు అందించాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

**జి.సిగడాం:** మండలంలోని వాం(డ్రంగి, పాలఖండ్యాం, జి.సిగడాం, పెంట గ్రామాల్లో గల ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయశాఖ అధికారి శారద గురువారం తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువుల నిల్వ, రికార్డుల నిర్వహణ, స్టాక్ వివరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులను అందించడం జరుగుతుందన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ సింహాద్రి హరికృష్ణ పాల్గొన్నారు.

### స్టూడెంట్ కిట్లు సరఫరా



ఉపాధ్యాయులకు పుస్తకాలను అందజేస్తున్న ఎంఈఓలు

**జి.సిగడాం:** విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంఈఓల అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన స్టూడెంట్ కిట్లును పాఠశాలలకు గురువారం పంపిణీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసినప్పుడు ఉత్తమ ఫలితాలు సాధించగలమన్నారు. ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు

**90 శాతం పాఠ్యపుస్తకాల సరఫరా..**

**ఎచ్చెర్ల క్యాంపస్:** ఎచ్చెర్ల మండలంలో ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు 90 శాతం పాఠ్య పుస్తకాల పంపిణీని పూర్తిచేసినట్లు మండల విద్యాశాఖ అధికారి కె.పున్నయ్య తెలిపారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం ఈ వివరాలు వెల్లడించారు. ఏడో తరగతికి సంబంధించి నాలుగు టైటిళ్లు, 1 నుంచి ఐదో తరగతి వరకు కొన్ని పుస్తకాలు రావల్సి ఉందన్నారు. 8 వేల మంది విద్యార్థులు ఉన్నారని, 14 వేల పుస్తకాలు అవసరం ఉందన్నారు. స్టూడెంట్ కిట్లు వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామన్నారు.

### 15న గాయత్రీ కళాశాలలో జాబ్‌మేళా

**శ్రీకాకుళం రూరల్:** మునసబుపేటలోని గాయత్రీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో ఈ నెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంక్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, ర్యాండ్స్ పేటీయం, నవతా ట్రాన్స్‌పోర్టు వంటి సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కస్టమర్ సర్వీస్ వంటి ఉద్యోగాలను కూడా భర్తీ చేస్తామని తెలిపారు. బీఎస్సీతో పాటు అన్ని గ్రూపుల వారు పాల్గొనవచ్చని, పూర్తి వివరాలకు 99127 44743 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### 18న శ్రీకూర్మం గ్రామదేవత ఉత్సవం



మోహినీ భద్రాంబిక అమ్మవారు

**గార:** మేజర్ పంచాయతీ శ్రీకూర్మం గ్రామదేవత మోహినీ భద్రాంబిక అమ్మవారి పండుగ ఈ నెల 18న నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మంగళవారం దేవరను తీసుకురావటంతో ఉత్సవం ప్రారంభమైందని, 18న అనుపు ఉత్సవంలో భాగంగా విచిత్ర వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మహిళలంతా మేళతాళాల నడుమ అమ్మవారి ఆలయానికి వెళ్లి ముర్రాటలు సమర్పిస్తారని తెలిపారు.

### ఉపాధి వేతనదారులను ఆదుకోవాలి

**శ్రీకాకుళం రూరల్:** ఉపాధి వేతనదారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం కోరారు. గురువారం బైరి గ్రామంలో ఉపాధి వేతనదారులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి వేతనదారులకు రూ.రెండు లక్షల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని, 200 రోజులు పనిదినాలు కల్పించాలని, రూ.600 వేతనం అందివ్వాలని డిమాండ్ చేసారు. పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

# చిన్నారుల బడిబాట

వేసవి సెలవుల అనంతరం ప్రైవేటు పాఠశాలలతో సహా అన్ని ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలలు పూర్తి స్థాయిలో గురువారం తెరుచుకున్నాయి. చిన్నారులు ఉత్సాహంగా తరగతులకు హాజరయ్యారు. గార, శ్రీకాకుళం రూరల్ మండలాలతో పాటు శ్రీకాకుళం నగరంలో విద్యార్థులతో పాఠశాలలు కళకళలాడాయి.

– శ్రీకాకుళం న్యూకాలనీ



పాఠశాలలో చేరిన 6వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం వాగ్దేవి, ఉపాధ్యాయులు



గార ప్రభుత్వ పాఠశాలకు వాహనంలో చేరుకున్న పుస్తకాలు, స్టూడెంట్ కిట్లు



ప్రార్థన చేస్తూ..



శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు



ఉత్సాహంగా బడిబాట



స్నేహితులతో కలిసి బడికి వస్తూ..

## పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు



మాట్లాడుతున్న వైద్యాధికారి సుమబిందు

**జి.సిగడాం:** స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయని, రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని వైద్యాధికారి పేకల సుమబిందు అన్నారు. ఆరోగ్య కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన క్వాలిటీ ఇంప్రూమెంట్ సమావేశంలో మాట్లాడారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆస్పత్రిలో ఎక్కువగా డెలవరీలు చేయించేలా ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు చొరవ తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలో గతం కంటే అధికంగా ఓపీలు పెరిగాయన్నారు. వర్షాలంలో గ్రామాల్లో అంటురోగాలు రాకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రాన్ని ఆధునిక హంగులతో ఏర్పాటు చేశామన్నారు. మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివప్రసాదరావు, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.సురేష్, పి.ఉమ, జి.మహేశ్వరరావు, కె.రాఘవ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**రణస్థలం:** మండల కేంద్రంలోని సూర్య ఆస్పత్రి ఆవరణంలో ఇడదాసుల విద్యా ఆరోగ్య సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత నేత్ర శిబిరాన్ని గురువారం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని సేవా ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు ఇడదాసుల వెంకట సత్యనారాయణ, ఫౌండేషన్ అధ్యక్షుడు తిరుపతిరాజు ప్రారంభించారు. 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 56 మందికి కంటి శస్త్ర చికిత్సల ఎంపికి చేసి విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్‌కు తరలించారు. అవసరమైనవారికి మందులు, అద్దాలు ఉచితంగా అందజేశారు. సూర్య ఆస్పత్రిలో గుండె జబ్బుల స్క్రీనింగ్ శిబిరంలో 100 మందికి ఈసీజీ పరీక్షలు, 2డీ ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి రూ.10 వేల విలువ చేసే మందులు ఉచితంగా అందజేశారు. వైద్యులు ఇడదాసుల యశ్వంత్, గుండె వైద్య నిపుణులు సీపాన వేణుగోపాల్, సేవా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## షిర్డీసాయికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

**శ్రీకాకుళం కల్చరల్:** నగరంలోని ఇలిసిపురం, ద్వారకానగర్‌లోని షిర్డీసాయి సంస్థాన్‌లో గురువారం సాయినాథునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కాగడ హారతి, వస్త్రాలంకరణసేవ, పుష్పాలంకరణ సేవ జరిగింది. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

**ఆనందపురంలో..**

**జి.సిగడాం:** మండలంలోని ఆనందపురం గ్రామంలో గురువారం షిర్డీ సాయి బాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 100 అడుగుల ఎత్తు గల వెంకటి సాయికోటి మహాస్థూపం వద్ద పూజ్యగురువుల అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో పలు పూజా కార్యక్రమాలు చేపట్టారు. దేవరవలస, పెంట, జాడ, గెడ్డకంచరాం, జి.సిగడాం గ్రామాల్లో గల బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజులు చేశారు



పూజలందుకుంటున్న నాగసాయి విగ్రహం

**ఎస్ఎస్ఆర్‌పురంలో..**

**ఎచ్చెర్ల:** మండలంలోని ఎస్ఎస్ఆర్‌పురం గ్రామంలోని బాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. బాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి తిరువీధి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబాను దర్శించుకున్నారు.

## ఎరువుల దుకాణాల తనిఖీ



విత్తనాలను తనిఖీ చేస్తున్న ఏఓ ఉషాకుమారి

**శ్రీకాకుళం రూరల్:** డీలర్ల వద్ద కొనుగోలు చేసే విత్తనాలకు సంబంధించి రైతులకు బిల్లులు విధిగా అందించాలని మండల వ్యవసాయాధికారి ఉషాకుమారి సూచించారు. గురువారం మండల పరిధిలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా మెయింటెయిన్ చేయాలని, నకిలీ విత్తనాలు కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మొలకెత్తే ధాన్యం గింజలను ప్యాకింగ్ చేసి రైతులకు అందివ్వాలని కోరారు.

## చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

**శ్రీకాకుళం అర్బన్:** మూడేళ్లు దాటిన ప్రీ స్కూల్ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ కృష్ణాపార్క్ సెక్టారు పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి కోరారు. నగరంలోని దూదివారి సందు, తుమ్మవీధి, మహిళామండలి వీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లలు చేర్పడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెక్టారు పరిధిలో ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి ప్రీస్కూల్ పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, సంధ్యారాణి, సునీత, నాగమణి, సుజాత పాల్గొన్నారు.

**శ్రీకాకుళం అర్బన్:** ఆటపాటలతో కూడిన విద్యనందించే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు గూనపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ బి.యోగీశ్వరి అన్నారు. మంగువారితోట, కమలా నివాస్ అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ర్యాలీ నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.కళ్యాణి, ఇందు, హెల్పర్లు హెచ్.విజయ, హసీనా తదితరులు పాల్గొన్నారు.

### బొందిలీపురంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

**శ్రీకాకుళం కల్చరల్:** నగరంలోని బొందిలీపురంలో సాయిదర్బార్ వద్ద గురువారం అన్నదానం నిర్వహించారు. అంతకుముందు మందిర అర్చకులు సంతోష్‌బ్రహ్మ ఆధ్వర్యంలో సాయినాథునికి ప్రత్యేక పూజలు చేశారు.

### వ్యక్తిపై కేసు నమోదు

**ఎచ్చెర్ల క్యాంపస్:** ఎచ్చెర్ల మండలంలోని చిలకపాలెంలో గల నాగార్జున అగ్రికెంలో పని చేస్తున్న ఉద్యోగి మద్ది వీరస్వామిపై వ్యక్తిగత కక్ష నేపథ్యంలో బావమరిది కొయ్యాన రామారావు గురువారం దాడిచేశారు. గత కొంతకాలంగా వీరస్వామి, భార్య గణపతమ్మ మధ్య విబేధాలు కొనసాగుతున్నాయి. రోజూ భర్త తనపై దాడి చేస్తున్నాడని తమ్ముడుకి ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. బావ వీరస్వామిపై శ్రీకాకుళం రూరల్ మండలం ఇప్పిలి పంచాయతీ లబ్బోడుపేట గ్రామానికి చెందిన రామారావు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. ప్రస్తుతం వీరస్వామి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. బాధితుని ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 6 సీట్లు.. 280 మంది హాజరు



ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు

**రణస్థలం:** మండలంలోని కొండములగాం ఆదర్శ పాఠశాలలో 7, 8, 9వ తరగతుల్లో మిగిలిన ఆరు సీట్లుకు గురువారం ప్రవేశ పరీక్ష నిర్వహించామని ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ తెలిపారు. ప్రవేశ పరీక్షను ఎంఈఓ అల్లాడ త్రినాథరావు పరిశీలించారు. ఆరు సీట్లుకు 283 మంది దరఖాస్తు చేసుకోగా.. 280 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 7వ తరగతిలో ఒక సీటు, 8వ తరగతిలో రెండు సీట్లు, 9వ తరగతిలో మూడు సీట్లు ఖాళీ ఉన్నాయి. ప్రవేశ పరీక్షకు ఒక్కొక్కరు ఫీజు రూ.150 చెల్లించి తల్లిదండ్రులతోపాటు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

### కలెక్టర్‌ను కలిసిన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

**శ్రీకాకుళం పాతబస్టాండ్ :** శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యుడిగా ఇటీవల ఎన్నికైన గొండు శంకర్ గురువారం కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీడీపీ నాయకుడు పీఎంజే బాబు తదితరులు ఉన్నారు. అనంతరం ఎస్పీ రాధికను కూడా ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

**అరసవల్లి:** నగరంలో విద్యుత్ పరంగా పలు మరమ్మతు పనులు, చెట్టు కొమ్మలు కొట్టే పనులు చేపట్టనుండటంతో శుక్రవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రామకృష్ణనగర్ కాలనీ, ఆర్ట్స్ కళాశాల రోడ్డు, ప్రాంగణం, శాంతినగర్ కాలనీ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

## వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు తగవు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



సమావేశానికి హాజరైన రణస్థలం నాయకులు, కార్యకర్తలు

● ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

**రణస్థలం:** కుటమి నాయకులు ఇచ్చిన బుటకపు హామీలను నమ్మి ప్రజలు అధికారం ఇస్తే మంచి పనులు చేయకుండా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు దిగడటం తగదని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాతర్లపల్లి గ్రామంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రణస్థలం మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం విడ్డురంగా ఉందన్నారు. అధికారం ఇచ్చిన వారం రోజుల్లోనే రాజ్యాంగాన్ని చేతుల్లోకి తీసుకుని వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేయడం సిగ్గుమాలిన చర్యని అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఏ ఒక్క టీడీపీ నాయకుడు విగ్రహం జోలికి వెళ్లలేదన్నారు. ప్రజాస్వామ్యంలో అధికారం ఎవరి సోత్తూ కాదని, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజలకే ఉపయోగపడాలన్నారు. ఎవరికీ భయపడవద్దని కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, చిల్ల వెంకటరెడ్డి, బస్వ దురుగుబాబు, గొర్లె విజయకుమార్, మైలపల్లి కామరాజు, రాయపురెడ్డి భుజంగరావు, పైడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక హబ్‌గా సంప్రదాయ గురుకులం



ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన



ముగింపు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

**శ్రీకాకుళం రూరల్:** సంప్రదాయ గురుకులాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండల పరిధిలోని కల్లేపల్లి గ్రామంలో సంప్రదాయ గురుకులం వద్ద క్షేత్రం డైరెక్టర్ స్వాతిసోమనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు ముగింపు సభ గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఇక్కడ పనిచేసిన జిల్లా కలెక్టర్ చొరవతో కల్లేపల్లిలో 10 ఎకరాల్లో సంప్రదాయ గురుకులం వెలసిందన్నారు. రానున్న రోజుల్లో కళాక్షేత్రాన్ని కాంపిటీషన్ ప్రాంగణంగా తీర్చుదిద్దుతామన్నారు. తన తండ్రి శ్రీకాకుళం ఎంపీపీగా ఉన్న సమయంలో మండల కమిటీ తీర్మానం కల్లేపల్లి గ్రామ పరిసర ప్రాంతంలో స్థల సేకరణ జరిగిందని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నాట్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో డాక్టర్ దానేటి శ్రీధర్, పార్టీ నాయకులు మూకళ్ల శ్రీనివాస్, దుంగ శ్రీధర్, మూకళ్ల జయానంద్, బైరి చిన్నవాడు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సంఘ నాయకులు

**శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):** శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులపై పని భారం తగ్గించాలని, ముఖ్యంగా మహిళా కార్మికులకు పని ఒత్తిడి తగ్గించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం కమిషనర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందించారు. కార్పొరేషన్ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, పీఎఫ్, ఈఎస్ఐలో టెక్నికల్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. పుష్ కార్ట్ వెహికల్స్, విల్ బార్ వెహికల్స్ మరమ్మతులకు గురికావడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సకాలంలో పనిముట్లు అందించాలని విన్నవించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తిరుపతిరావు, కళ్యాణి అప్పలరాజు, పార్థసారథి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పనుల పరిశీలన

**గార:** నిర్దేశిత కొలతల్లో నాణ్యమైన పనితో గరిష్ఠ వేతనం పొందవచ్చని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. గురువారం అంపోలు పంచాయతీ అంబటిఎరుకువానిపేట, రామకృష్ణాపురం, శ్రీకూర్మం పంచాయతీ గోరువానిపేటలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి వేతనదారులు సమయపాలన పాటించాలన్నారు. చెరువులు అభివృద్ధి చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఖరీఫ్ సీజన్ కావడంతో సాగునీటి కాలువలు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఏపీవో సీహెచ్ సంధ్యారాణి, జేఈ నారంనాయుడు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.